

పాఠకులకు,
ప్రకటన కర్తలకు,
మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
వినాయక
చవితి పర్వదిన
శుభాకాంక్షలు



జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం | 27 | ఆగస్టు | 2025 ◆ పేజీలు : 6




- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గణపతి ఉత్సవాలకు సిద్ధం
- పల్లె నుంచి పట్నం వరకు భక్తి తరంగం
- నేటి నుంచి ప్రతిష్ఠలు, శోభాయాత్రలు
- పర్యావరణ హిత గణపతులే ఆకర్షణ
- పోలీస్, మున్సిపల్ ఏర్పాట్లు పూర్తి

### గజాననుడి పండుగ ఆరంభం...

# మండపాల శోభ అపారం

విఘ్నాలను తొలగించే వినాయకుడు... జ్ఞానం, విజయాన్ని ప్రసాదించే గణేశుడు... ఆయన మహిమను జపిస్తూ, 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంతా సందడిగా మారబోతోంది. నేటి నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలకు మండపాల వద్ద అలంకరణలు సిద్ధమవుతుండగా, భక్తులు భక్తిశ్రద్ధలతో శోభాయాత్రల కోసం ఎదురుచూస్తున్నారు. పల్లె నుంచి పట్టణం వరకు ప్రతి మూలలో భక్తి తరంగమే అలముకుంటోంది. అలంకారాల కాంతులతో గజాననుడి ఆరాధనకు సర్వం సిద్ధమయ్యింది.

2 లో..

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి





## ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

### జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం (కలెక్టరేట్) ఆగస్టు 26 (ప్రజాజ్యోతి):** వివిధ సమస్యలతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయం అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ వైద్యులను ఆదేశించారు. మంగళవారం పాల్వంచ మండలం శేఖరం బంజర గ్రామంలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా కలెక్టర్ ఆరోగ్య కేంద్రంలోని అన్ని విభాగాలను పర్యవేక్షించి, రోగుల రికార్డులు, రిజిస్టర్లు, ఔషధ నిల్వలు, వ్యాక్సిన్ భద్రత, ల్యాబ్ సదుపాయాలను నిశితంగా పరిశీలించారు. తనిఖీ సందర్భంగా వైద్యులు, నర్సింగ్ సిబ్బందితో మాట్లాడిన కలెక్టర్ , ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి, సమయానికి మంచి వైద్యం అందించాలని ఆదేశించారు. వైద్యులు మరియు సిబ్బంది సమయపాలన పాటించి, విధుల్లో నిర్లక్ష్యం చేయకుండా

మిగతా 2 లో...



# ఉండ్రాలయ్యా.. వస్తున్నాడు...

- నేటి నుంచి వినాయక నవ రాత్రి ఉత్సవాలు
- వాడవాడలా ముస్తాబైన మండపాలు
- తొమ్మిది రోజుల పాటు అంగరంగా వైభవంగా పూజలు
- భక్తులకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

**దమ్మపేట ,ఆగస్ట్ 26,ప్రజాజ్యోతి :** విఘ్నాలను తొలగించే అధినాయకుడు.. వినాయకుడు బుధవారం కొలువుదీరను న్నాడు. దమ్మపేట మండల వ్యాప్తంగా వాడవాడలా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలను సిద్ధం చేశారు. వినాయక చవితి నవరాత్రి వేడుకలను తొమ్మిది రోజులపాటు నిర్వహించనున్నారు. మండల కేంద్రం దమ్మపేట లో, చుట్టు ప్రక్కల గ్రామాలు ,మందలపల్లి,ముస్టిబండ ,మొద్దులగూడెం, పట్వారి గూడెం, అంకంపాలెం,నాగుపల్లి , గండుగులపల్లి తదితర ప్రాంతాల్లో యువత, భక్తులు మండపాలను ఏర్పాటు చేశారు. మండల కేంద్రమైన దమ్మపేట మెయిన్ సెంటర్

మిగతా 2 లో...

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి



(మొదటి పేజీ తరువాయి...)

క్రమశిక్షణతో వ్యవహరించాలని ఆయన ప్రత్యేకంగా సూచించారు. గర్భిణీలు, చిన్నపిల్లలు, వృద్ధులకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సేవలలో ఎలాంటి లోపం జరగరాదని ఆయన స్పష్టం చేశారు. ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత, మందుల పంపిణీ, హాజరు రికార్డులపై కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించారు. వ్యాక్సిన్ నిల్వ ఫ్రీజర్ ను స్వయంగా పరిశీలించి కోల్డ్ చెయిన్ సక్రమంగా నిర్వహించబడుతోందో లేదో తనిఖీ చేశారు. టీకా భద్రత విషయంలో ఎలాంటి లోపాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా భవనంలోని పైకప్పు స్లాబ్ లీకేజీ సమస్యను గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులకు తక్షణ మరమ్మత్తులు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలను కల్పించాలన్నారు. జిల్లాలో ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు నమ్మకమైన వైద్యసేవల కేంద్రంగా మారాలని, వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజలు ప్రభుత్వ వైద్యసేవలను మరింత విశ్వాసంతో వినియోగించుకోవాలని ఆయన కోరారు. అదేవిధంగా, జిల్లాలో ఆరోగ్య సేవల మెరుగుదలపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని, ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించడమే లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలోనూ ప్రాథమిక వైద్య సదుపాయాలు మెరుగుపరిచి, ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలన్నారు. ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట డాక్టర్ కృష్ణకుమారి, పి హెచ్ ఓ శ్రీనివాస్, ఎల్ టి శృతి, స్టాఫ్ నర్స్ రాములమ్మ, ఫార్మాసిస్ట్ లలిత, మెడికల్ అసిస్టెంట్ సుధాకర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది మరియు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ సిఏ వన్డే క్రికెట్ లీగ్స్ లో మెరిసిన ఏజెన్సీ ఆణిముత్యం నక్కా రిత్విక్



**భద్రాచలం, ఆగస్టు 26, ప్రజాజ్యోతి :** భద్రాచలం పట్టణానికి చెందిన యువ క్రికెటర్ నక్కా రిత్విక్ హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హేసిఏ) ఆధ్వర్యంలో ఘట్‌కేసర్‌లో జరిగిన వన్డే లీగ్ టోర్నమెంట్‌లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి అందరి ప్రశంసలు అందుకున్నారు. చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న రిత్విక్, ఈ టోర్నమెంట్‌లో తన బ్యాటింగ్ నైపుణ్యాన్ని చాటుకున్నాడు. కేవలం 134 బంతుల్లో 116 పరుగులు సాధించి సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఇన్నింగ్స్‌లో 16 ఫోర్లు, ఒక సిక్స్‌తో ప్రేక్షకులను అలరించాడు. అతడి అద్భుతమైన ఆటతీరు చూసి కోచ్‌లు, నిర్వాహకులు, తోటి క్రీడాకారులు ప్రశంసించారు. ప్రస్తుతం పట్టణంలోని క్రాంతి విద్యాలయంలో 9వ తరగతి చదువుతున్న రిత్విక్ సాధించిన ఈ విజయం పట్ల అతని పాఠశాల యాజమాన్యం, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాల చైర్మన్ సోమరౌతు శ్రీనివాస్, రిత్విక్‌ను అభినందించారు. అతనికి శిక్షణ ఇచ్చి, ఇంతటి ప్రతిభావంతుడిగా తీర్చిదిద్దిన చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీ కోచ్ కుప్పాల శరణ్ తేజను కూడా అందరూ అభినందించారు. భవిష్యత్తులో రిత్విక్ మరిన్ని విజయాలు సాధించి, క్రికెట్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

# గజాననుడి పండుగ ఆరంభం.. మండపాల శోభ అపారం

**కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఆగస్టు 26, (ప్రజాజ్యోతి):** విఘ్నాలను తొలగించే వినాయకుడు... జ్ఞానం, విజయాన్ని ప్రసాదించే గణేశుడు... ఆయన మహిమను జపిస్తూ, 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అంతా సందడిగా మారబోతోంది. నేటి నుంచి ప్రారంభమయ్యే గణపతి నవరాత్రి ఉత్సవాలకు మండపాల వద్ద అలంకరణలు సిద్ధమవుతుండగా, భక్తులు భక్తిశ్రద్ధలతో శోభాయాత్రల కోసం ఎదురుచూస్తున్నారు. పల్లె నుంచి పట్టణం వరకు ప్రతి మూలలో భక్తి తరంగమే అలముకుంటోంది. అలంకారాల కాంతులతో గజాననుడి ఆరాధనకు సర్వం సిద్ధమయ్యింది.

### జిల్లా అంతట ఏర్పాట్లు..

జిల్లా అంతటా గణపతి నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యేలా ఏర్పాట్లు ముగిశాయి. మండపాల అలంకరణలు, విద్యుత్–నీటి సదుపాయాలు, శోభాయాత్ర మార్గాల శుభ్రపరిచే పనులు వేగంగా సాగుతున్నాయి. మట్టి విగ్రహాలను ప్రోత్సహించేలా యువత అవగాహన కార్యక్రమాలు ప్లాన్ చేశారు. నిమజ్జన రోజున ట్రాఫిక్ మళ్లింపులు, ప్రత్యేక రూట్లు అమల్లోకి రానున్నాయి. ఈ సారి మహా నిమజ్జనం నవరాత్రులతో పూర్తవడంతో నిమజ్జన సెప్టెంబర్ 5న నిర్వహించేలా ప్రాథమిక షెడ్యూల్ సిద్ధమైంది.

### ప్రధాన కేంద్రాల్లో ఏర్పాట్లు ఇలా..

**కొత్తగూడెం పట్టణం..**
ప్రధాన బస్టాండ్, టౌన్ హాల్, మణుగూరు రోడ్, కొత్త కాలనీల్లో భారీ మండపాలు సిద్ధం. మున్సిపల్ బృందాలు శుచీకరణ, తాత్కాలిక శౌచాలయాలు, తాగునీటి ట్యాంకర్లు ఏర్పాటు పూర్తిచేశాయి. ట్రాఫిక్ విభాగం శోభాయాత్రల కోసం ప్రత్యేక రూట్ మ్యాప్ సిద్ధం చేసింది.

### మణుగూరు మండలం..

కోల్స్ టౌన్ షిప్, గణపతి బజార్ పరిసరాల్లో మట్టి



గణపతులే ప్రధానంగా ప్రతిష్ఠ చేయబోతున్నారు. సింగరేణి కార్మిక సంఘాలు మట్టి విగ్రహాల స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నారు.

### కోత్తగూడెం – పాల్వంచ మండలాలు..

బస్ డిపో, సీసీఎస్, పాల్వంచ మార్కెట్ యార్డ్ వద్ద శోభాయాత్రలతో పాటు స్థానిక కళారూపాల ప్రదర్శనలు (బోనాలు, బుర్రకథ) నేటి సాయంత్రం మొదలు. కాలనీవారీ మండపాలకు విడివిడి టైమ్ స్లాట్లు కేటాయించారు.

### ఇల్లందు..

పాఠశాలలు–కళాశాలల విద్యార్థులు విత్తన గణపతులు ప్రతిష్ఠించేందుకు సిద్ధం. మహిళా సంఘాలు పూల అలంకరణ, దీపాలంకరణతో "ప్లాస్టిక్–ఫ్రీ మండపం" ప్రచారం ముందుండి చేస్తున్నారు.

### భద్రాచలం..

శ్రీరామాలయం పరిసరాల్లో ప్రత్యేక మండపాలు సిద్ధం. సాంస్కృతిక కార్యక్రమాలు, భజన మండళ్లు ప్రధాన ఆకర్షణ. గోదావరి ఘాట్ వద్ద నిమజ్జనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏజెన్సీ ఊర్లలో సంప్రదాయ డప్పు నృత్యాలు, జానపద గీతాలతో ఉత్సవాలు నిర్వహించనున్నారు.

### చర్ల–దమ్మపేట మండలాలు..

కాలనీల్లో కార్మిక సంఘాలు రక్తదాన శిబిరాలు, ఉచిత నీటి పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేయబోతున్నాయి. విద్యుత్ అంతరాయాలు లేకుండా ట్రాన్స్ ఫార్మర్ల వద్ద మొబైల్ మెయింటెనెన్స్ టీమ్స్ మోహరించారు.

### అశ్వాపురం–బూర్గంపాడు మండలాలు..

గ్రామాల వారీగా చిన్న మండపాలు సిద్ధం. పిల్లల కోసం "చిన్న వినాయక మండపం" కాన్సెప్ట్ తో డ్రాయింగ్, శ్లోకపఠనం పోటీలు నేటి నుంచే ప్రారంభం.

### భద్రత – సదుపాయాల కీలక ఏర్పాట్లు

ట్రాఫిక్ మళ్లింపులు: కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు ప్రధాన కేంద్రాల్లో ఒకదిశా రవాణా. ప్రత్యామ్నాయ రూట్ల సూచిక బోర్డులు ఏర్పాటు.

**వైద్యం:** 108 అంబులెన్సులు, మొబైల్ మెడికల్ టీమ్స్, ప్రాథమిక చికిత్స కౌంటర్లు ప్రధాన మండపాల వద్ద.

అగ్నిమాపక భద్రత: ఫైర్ టెండర్లు, ఫైర్ ఎక్స్ టింగ్విషర్లు తప్పనిసరి. విద్యుత్ కనెక్షన్లకు ఎర్త్ పిట్స్, ఎంసీబీలు అమలు.

**పర్యావరణం: మట్టి / విత్తన గణపతుల ప్రోత్సాహం;** నిమజ్జనానికి ప్రత్యేక కుంటలు–చెరువులు; రంగులు, ప్లాస్టిక్ పూలకు బదులు సహజ పదార్థాల వినియోగం.

**శబ్ద నియంత్రణ:** రాత్రి 10 తర్వాత డీజే/లౌడ్ స్పీకర్ వినియోగంపై కఠిన పర్యవేక్షణ.

### షెడ్యూల్ (ప్రాథమిక)

**ఆగస్టు 27:** విగ్రహ ప్రతిష్ఠ–శోభాయాత్రలు (మండలాల వారీ టైమ్ స్లాట్లు).
**ఆగస్టు 28–సెప్టెంబర్ 4:** సాంస్కృతిక–భక్తి కార్యక్రమాలు, సామాజిక సేవా శిబిరాలు.
**సెప్టెంబర్ 5:** మహా నిమజ్జనం (ప్రత్యేక రూట్ మ్యాప్–ట్రాఫిక్ మళ్లింపులు అమలు)

# ఉండ్రాలయ్య వస్తున్నాడు..

**సాయి కిషోర్ రెడ్డి**

(మొదటి పేజీ తరువాయి...)

తదితర ప్రాంతాల్లో వీధివీధినా గణేష్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయాలు, ఇళ్లు, మండపాల్లో వినాయకుడిని పూజించేందుకు భక్తులు సిద్ధమయ్యారు. పూజాసామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా మారాయి. కాగా ప్రతి మండపంలో నిర్వాహకులు ప్రశాంతంగా పూజలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సౌండ్ సిస్టంను రాత్రి 10లోపు మాత్రమే వినియోగించాలని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని దమ్మపేట పోలీసులుసూచిస్తున్నారు.

### ♦ తొమ్మిది రోజుల పాటు వేడుకలు

నేటి నుంచి తొమ్మిదిరోజుల పాటు గణపతిని పూజించనున్నారు. పిల్లలు పెద్దలు అనే తేడా లేకుండా అందరూ భక్తి శ్రద్దలతో సంతోషముగా జరుపుకునే పండుగ. రజిత కవచాలంకృత గణపతి, బాల గణపతి, నాట్య గణపతి, మూషిక గణపతి, కాణిపాకం గణపతి, విద్యా గణపతి, లక్ష్మీ గణపతి, బాల గణపతి, సిద్ధి గణపతి, శయన గణపతి, నిజరూప గణపతిగా



వరుసగా తొమ్మిది రోజులపాటు వినాయకుడు పూజలందుకోనున్నాడు.

### ♦ 21 రకాల పత్రాలతో పూజలు

వినాయకుడికి 21 రకాల పత్రాలతో భక్తులు భక్తి శ్రద్దలతో పూజలు చేశారు. మాచీపత్రం, బృహతీపత్రం (వాకుడాకు, నేల మూలిక), బిల్వ పత్రం (మారేడు), దూర్వాయుగ్మం (గరిక), దత్తూర పత్రం (ఉమ్మెత్త), బదరి పత్రం (రేగు ఆకు), తులసీ పత్రం (తులసీ), అపామార్గ పత్రం (ఉత్తరేణి పత్రం), చూతపత్రం (మామిడి పత్రం), కరవీరపత్రం (గన్నేరు పత్రాలు), విష్ణుకాంతం (హారి పత్రం), దాడిమీపత్రం (దానిమ్మ పత్రం), దేవాదారుపత్రం మరువక పత్రం(మరువము), సింధువారపత్రం (వావి లాకు), జాజిపత్రం, గండకీపత్రం (కామంచి, అడవి మల్లె), శమీపత్రం(జమ్మి పత్రం), అశ్వాత్థపత్రం (రావి ఆకు), అర్జున పత్రం( మద్ది ఆకు), అర్క పత్రం(జిల్లేడు పత్రం)లతో వినాయకుడిని పూజిస్తారు.

### ♦ ప్రశాంతంగా ఉత్సవాలు జరుపుకోవాలి: దమ్మపేట యస్ ఐ



వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి. మత సామరస్యాన్ని పాటించాలి. ప్రతి వినాయక మండపానికి కమిటీ సభ్యులు బాధ్యత వహించాలి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వొద్దు. ప్రతి మండపానికి అనుమతులు తీసుకోవాలి. డీజే సౌం డ్ సిస్టం వినియోగిస్తే సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేస్తామని మండపాలను విద్యుత్ లైన్ల క్రింద ,విద్యుత్ లైన్లకు,ట్రాన్స్ ఫార్మర్లకు దగ్గరగా ఏర్పాటు చేయరాదు. అందరూ మట్టి గణపతి విగ్రహాలను వాడటం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందాం అని పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు అవ్వాలని ఇంటింట మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు.

# భద్రాద్రి చేరుకున్న పి డి ఎస్ యు విద్యార్థి పోరుబాట యాత్ర

- తెలంగాణలో పాలకులు మారినా ప్రభుత్వ విద్య అభివృద్ధికి నోచుకోవడం లేదు
- శిధిలావస్థలో ఉన్న భద్రాచలం జూనియర్ కళాశాలకు మరమత్తులు చేపట్టాలి
- పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ
- పి డి యస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేత మునిగల శివ ప్రశాంత్.






**భద్రాచలం టౌన్, ఆగష్టు 26(ప్రజా జ్యోతి):**తెలంగాణలో పాలక ప్రభుత్వాలు మారినా ప్రభుత్వ విద్య అభివృద్ధికి నోచుకోవడం లేదని హై స్కూల్ స్థాయి నుండి యూనివర్సిటీల స్థాయి వరకు ప్రభుత్వ విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని పి డి యస్ యూ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వీ అన్నారు. మంగళవారం చేరుకున్న భద్రాచలంలో విద్యార్థి పోరబాట యాత్ర సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరిగిన మీటింగ్ కు పి డి యస్ యూ రాష్ట్ర నాయకులు బి.సాయి అధ్యక్షత వహించగా వారు పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సందర్భంలో విద్య అభివృద్ధికి 15% నిధులు కేటాయిస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మూడుసార్లు ప్రవేశపెట్టిన బడ్జెట్లో 7 శాతానికి మించి బడ్జెట్ ను కేటాయించలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా, శిధిలావస్థలో ఉన్న పాఠశాల,కళాశాల భవనాలకు మరమ్మత్తులు చేపట్టకుండా, మరుగుదొడ్లు రక్షిత మంచినీటి సమస్య, విద్యార్థులకు కంప్యూటర్ విద్య లేమి, ప్రహరీ గోడల సమస్యలతో మరమ్మతులు చేయాలని కొట్టుమిట్టాడుతున్న విద్యా వ్యవస్థను గాడిలో పెట్టాల్సింది పోయి మరింత సంక్షోభంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం నెట్టేస్తుందని అన్నారు. పి డి యస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నేత మునిగెలా శివ ప్రశాంత్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కొత్త మెనూ రూపొందించారు గాని దానికి సంబంధించిన మెనూ ప్రకారం కిరాణం అందించడంలో వైఫల్యం చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భద్రాచలం పట్టణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల శిధిలావస్థలో ఉందని తక్షణమే మరమ్మత్తులు చేపట్టాలని ఆయన తెలిపారు. అదేవిధంగా భద్రాచలం కేంద్రంగా లా కాలేజ్ ని, ఇల్లందు కేంద్రంగా ప్రభుత్వ ఐటిఐ కళాశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామ్ చరణ్,అబ్దుల్ గని, శ్రావణి, సంధ్య,విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# విఘ్నేశ్వర మండపాలకు ఉచిత విద్యుత్

- టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్



**చర్ల, ఆగష్టు 26(ప్రజా జ్యోతి ):**తెలంగాణా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించబోయే శ్రీ వర సిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్సవ మండపాలకు , దుర్గామాత మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి అంగీకరించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి వర్యులు ఎనములు రేవంత్ రెడ్డికి , ఉపముఖ్యమంత్రి వర్యులు, విద్యుత్ శాఖ మంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్కకి ఇతర మంత్రివర్గానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు తగు జాగ్రత్తలు పాటిస్తూ మండపాల ఏర్పాట్లు నిమజ్జన కార్యక్రమాలు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

# ఇందిరానగర్ కాలనీలో సంవత్సరం నుండి శుభ్రం చేయని డ్రైనేజీ

- పడకేసిన పారిశుధ్యం ప్రబలుతున్న విష జ్వరాలు
- సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి. గడ్డం, స్వామి.



**భద్రాచలం టౌన్, ఆగష్టు 26(ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో ఒకపక్క భారీ వర్షాలు రావడంతో పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో విష జ్వరాలు వ్యాపిస్తున్నాయి. అలాగే కాలనీలో సంవత్సరం గడుస్తున్న డ్రైనేజీలు శుభ్రం చేసే నాధుడే కరువయ్యాడని తక్షణమే ఇందిరానగర్ కాలనీలో డ్రైనేజీ శుభ్రపరచాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమస్యల అధ్యయన యాత్రలో భాగంగా భద్రాచల పట్టణంలోని 9వ వార్డ్ ఇందిరానగర్ కాలనీ సిపిఎం బృందం వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సందర్శించడం జరిగింది. ఇందిరానగర్ కాలనీ అధ్వానంగా ఉందని వీధిలైట్లు కూడా లేని పరిస్థితి ఉందని కొన్ని నెలలు గడుస్తున్నా డ్రైనేజీని శుభ్రపరచడం లేదని తక్షణమే అధికారులు ఇంద్రానగర్ కాలనీ సందర్శించి వెంటనే యుద్ధ ప్రాతిపదికన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని అక్కడ ఉన్న సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. కొన్ని నెలలుగా డ్రైనేజీ శుభ్రపరచుకు పోవడంతో కాలువలో మురుగునీరు చేరడంతో వైరస్ బ్యాక్టీరియా కాలనీ అంతా దోమలతో నిండిపోయిందని డ్రైనేజ్ వలన దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని దీని వలన స్థానికులు రోగుల బారిన పడుతున్నారని , తక్షణమే పారిశుద్ధ్య పనులు మొదలుపెట్టాలని వారన్నారు. ఒకవైపు వర్షాలు, మరోవైపు సీజనల్ వ్యాధులు ప్రబులుతున్నాయని పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి ఇందిరానగర్ లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి గుండోజు రాధా, పార్టీ సభ్యులు మంగయ్య, కమల మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# క్రాంతి విద్యాలయంలో ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



**భద్రాచలం టౌన్, ఆగష్టు 26(ప్రజాజ్యోతి):**భద్రాచలంలోని స్థానిక క్రాంతి విద్యాలయంలో పాఠశాల కరస్పాండెంట్ పానుగంటి సమత శ్రీనివాస్ అధ్యక్షతన వినాయక చవితిని ఎంతో భక్తి శ్రద్ధలతో, ఉత్సాహంతో ఘనంగా జరిపారు. విద్యార్థులు స్వయంగా మట్టితో వినాయకుడి విగ్రహాన్ని తయారుచేసి, పూలతో అలంకరించి, వినాయకుడి కి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ,విద్యార్థులు శివుడు, పార్వతి మరియు వినాయకుని వేషధారణలో అలరించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పాఠశాల కరస్పాండెంట్ సమత శ్రీనివాస్ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతిలో వినాయక చవితికి ప్రత్యేక స్థానం ఉంది. ఇటువంటి ఉత్సవాల ద్వారా విద్యార్థులలో సాంస్కృతిక విలువలు, సమూహంలో పని చేసే నైపుణ్యం, భక్తి భావన పెంపొందుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక ,అధ్యాపకేతర బృందంతో పాటు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో నవరాత్రు లు జరుపుకోండి మానాల వెంకన్న





**గుండాల. ప్రజా జ్యోతి 26.** వినాయక నవరాత్రుల పూజలను భక్తిశ్రద్ధలతో క్రమశిక్షణ పాటిస్తూ జరుపుకోవాలని ప్రముఖ వ్యాపారి మానాల వెంకన్న అన్నారు మండల కేంద్రంలోని తన నివాసంలో 12 గ్రామాల లో ఏర్పాటు చేసిన మండపాలకు వినాయక విగ్రహాలను అందజేసిన అనంతరం ఆ మండప కమిటీల సభ్యులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు హిందూ మతంపై గౌరవం పెంచడంతోపాటు భక్తి శ్రద్దలు పెరగడానికి తను 12 విగ్రహాలను అందజేసినట్లు ఆయన తెలిపారు ఈ నవరాత్రులు బుక్స్ ఎంతవరకు నిత్యం పూజలు చేసుకుంటూ క్రమశిక్షణతో మెలగాలని ఆయన కోరారు మన కర్మ శిక్షణ చూసి హిందూ మతంపై మక్కువ పెంచుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో మానాల ప్రభాకర్ మానాల ప్రణీత్ శ్రావణ్ కుమార్ కోదూరు శ్యామ్ తిరు కొల్లూరి వెంకటేశ్వర్లు యాసారపు సురేష్ గుండెబోయిన లక్ష్మణ్ పిల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దుండగులను కఠినంగా శిక్షించాలి

- బాధితురాలని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలి
- తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం




**భద్రాచలం టౌన్, ఆగష్టు 26(ప్రజాజ్యోతి):** గుత్తి కోయ ఆదివాసి మహిళపై సామూహిక అత్యాచారం చేయడం హేయమైన చర్య అని, అత్యాచారం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, బాధితురాలిని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం భద్రాచలం పట్టణ కార్యదర్శి కుంజా శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం సమావేశం స్థానిక పాల కేంద్రం వద్ద జరిగింది. ఈ సందర్భంగా కుంజా శ్రీనివాస్ మాట్లాడుతూ అమాయకురాలైన గుత్తి కోయ ఆదివాసి గిరిజన మహిళపై జరిగిన అత్యాచార సంఘటనను తీవ్రంగా ఖండించారు. ఇది సమాజం తలదించుకునే చర్యని, హేయమైన చర్య అని అన్నారు. అత్యాచారం చేసిన దుండగులను తీవ్రంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అత్యాచారానికి గురైన ఆదివాసి మహిళను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, కావలసిన వైద్యం అందించాలని ఆయన కోరారు.. ఈ కార్యక్రమంలో రవ్వ సారిక, కుంజా విజయ, కూర ముత్తమ్మ, తెల్లం కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి దరఖాస్తులకు పట్టాలివ్వాలి

- సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ

**టేకులపల్లి,ఆగష్టు26,ప్రజాజ్యోతి :**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూభారతి పథకం ద్వారా రైతుల భూములకు తక్షణమే పట్టాలు ఇవ్వాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు.అఖిల భారత రైతుకూలి సంఘం (ఏఐకెయంఎస్) జిల్లా నాయకులు భుక్య హర్జా డిమాండ్ చేశారు.మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతి పథకం ద్వారా సర్వే నిర్వహించి సంవత్సరం పూర్తి అయినప్పటికీ ప్రభుత్వం రైతులకు పట్టాలను ఇవ్వలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆగష్టు 15వరకు సర్వే అయిన ప్రతి రైతుకు పట్టాలు ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం రైతులకు పట్టాలను ఇవ్వలేదని వారు అన్నారు.తక్షణమే పట్టాలు ఇవ్వాలని ఇవ్వని యెడల సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళన చేపడతామని వారు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత రైతుకూలి సంఘం (ఏఐకేఎంఎస్) మండల కార్యదర్శి ఎట్టి నరసింహారావు, నాయకులు భుక్య నర్సింగ్,అనంతోజు చంద్రచారి తదితరులు పాల్గొన్నారు.



## సారపాక గ్యాస్ ఏజెన్సీ గోడౌన్లో చోరీ

- రూ.1.2లక్షల విలువైన 33 గ్యాస్ సిలిండర్లు చోరీ

**బూర్గంపహాడ్, ఆగస్టు 26 (ప్రజా జ్యోతి ):** పారిశ్రామిక ప్రాంతమైన సారపాక లోని శ్రీసాయి గ్యాస్ ఏజెన్సీస్ గోడౌన్లో చోరీ జరగ్గా 33 సిలిండర్లు దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... 24వ తేదీ సాయంత్రం సారపాక శ్రీ సాయి గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ తాళం పగలగొట్టి గుర్తుతెలియని దుండగులు గ్యాస్ సిలిండర్లు ఎత్తుకెళ్లారు. 25న ఉదయం గోడౌన్కు వచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉండటంతో మేనేజర్కు అనుమానం రావడంతో స్టాక్ను పరిశీలించగా గ్యాస్తో నిండి ఉన్న 33 గ్యాస్ సిలిండర్లు ఎత్తుకెళ్లారని గమనించి గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ గణేష్ యజమాని యశ్వంత్కు తెలిపారు. సోమవారం రాత్రి చోరీ ఘటనకు సంబంధించి మేనేజర్ గణేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన ఒక్కో గ్యాస్ సిలిండర్ విలువ రూ.3092 ఉండగా మొత్తం విలువ రూ.1.2లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎస్సై మేడా ప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం గ్యాస్ గోడౌన్ వద్ద సంఘటనా స్థలాన్ని పరిశీలించి సీసీ పుటేజి పరిశీలనతో పాటు ఇతర ఆధారాలను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

## క్షుద్ర పూజల కలకలం



**ఆళ్ళపల్లి. ఆగస్టు26. ప్రజాజ్యోతి:** క్షుద్ర పూజలు, చేతబడికి సంబంధించిన సంఘటనలు తరచుగా వార్తల్లో కనిపిస్తున్నాయి. ఈ సంఘటనలు ప్రజలలో భయాందోళనలు సృష్టిస్తున్నాయి.ఈ క్షుద్ర పూజల సంఘటనల్లో ఎక్కువగా రోడ్లు కలిసే చోట, ఊరి బయట లేదా నిర్మానుష్య ప్రదేశాలలో పూజలు చేసిన ఆనవాళ్లు కనిపిస్తాయి. పసుపు, కుంకుమ, నిమ్మకాయలు,మేకులు. రంగు రంగుల దారలు. కొబ్బరికాయలు, వంటివి ఆళ్ళపల్లి మండల పరిధిలో మర్కోడు గ్రామం ఓ ఇంటిముందు పూజలో ఉపయోగించినట్లు గుర్తించారు.ఈ ఘటనల వెనుక ఉన్న వారిని గుర్తించి.ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా పాల్పడేవారిపై పోలీసు వారు చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని. గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## వర్షంలో పాయం పర్యటన

**గుండాల. ప్రజా జ్యోతి 26.** ఉండాల మండలంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్ల పర్యటన వర్షంలో కొనసాగింది పర్యటన ప్రారంభం నుండి వర్షం ముగిసే వరకు వర్షంలోనే పర్యటన కొనసాగింది తామరతోగు గ్రామంలో ప్రారంభమైన పర్యటన వెంకటాపురం సాయన్నపల్లి పాల గూడెం నాగారం గుండాల లింగగూడెం చీమల గూడెం వెన్నెల బైలు అన్ని గ్రామాలలో పర్యటనంతా జోరు వానలో కొనసాగింది.

## పర్యావరణాన్ని రక్షిద్దాం..మట్టి గణేష్ విగ్రహాలు పూజిద్దాం

- ఎఫ్ఆర్వో తేజస్విని



**పినపాక, ఆగష్టు 27(ప్రజాజ్యోతి ):** గణేశ్ నవరాత్రి వేడుకలు సందర్భంగా మట్టి గణపతిని ప్రతిష్ఠించి పర్యావరణాన్ని రక్షించాలని, పినపాక ఫారెస్ట్ రేంజ్ అధికారి తేజస్వి అన్నారు. గణపతి నవరాత్రులు సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో ఏడూళ్ళ బయ్యారం క్రాస్ రోడ్ పరిధిలో మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఎఫ్ఆర్వో తేజస్విని మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పిఓపి) విగ్రహాలు నీటి వనరులను తీవ్రంగా కాలుష్యం చేస్తుండగా, వాటి రసాయనాలు జలజీవులను నాశనం చేస్తున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించడం ద్వారా నీటి వనరులు కాపాడటమే కాకుండా పర్యావరణానికి మేలు జరుగుతుందని వారు తెలిపారు. గణపతి విగ్రహాలను సహజ మట్టితో తయారు చేసి, పం డుగ అనంతరం గృహంలో గానీ, తోటల్లో గానీ నిమజ్జనం చేయవచ్చు అని తెలిపారు. ఇలా చేయడం ద్వారా ప్రకృతి సమతుల్యం నిలబెట్టవచ్చని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్వోలు వెంకటేశ్వర్లు, అరుణ, ఎఫ్ఎస్వో వెంకటమ్మ, బీట్ ఆఫీసర్ లు రాణి, శశిరేఖ, ఆదిత్య, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

# నానో యూరియా, నానో డిఎపి తో రైతులకు చాలా మేలు : వ్యవసాయ అధికారి,ఆత్మ డిపిడి





**టేకులపల్లి, ఆగష్టు26, ప్రజాజ్యోతి:** మండలంలోని శ్రీనందిని ట్రేడర్స్ ఎరువుల దుకాణం నందు మండల వ్యవసాయ శాఖ అధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో మంగళవారం నానో యూరియా, నానో డిఏపి పై అవగాహన కల్పించే కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వేల్పుల బాబురావు, ఆత్మ డిపిడి.బి. సరిత హాజరై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నానో యూరియా,నానో డిఎపి దీనివల్ల రైతులకు చాలా మేలు జరుగుతుందని తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించవచ్చని రైతులకు అవగాహన కల్పించారు. నానో యూరియా,నానో డిఎపి మొక్కలలో పచ్చదనం, చురుకైన పెరుగుదల, పంట అభివృద్ధికి దోహదపడుతుందని తెలియజేశారు.మొక్కల నత్రజని అవసరాన్ని సమర్థవంతంగా తీరుస్తూ , ఆకులలో కిరణ జన్య సంయోగ క్రియను పెంచుతుంది అన్నారు. వేర్లల్లో కణజాలమును వృద్ధి చెందిస్తుంది. ఉపయోగకరమైన పిలకలను, శాఖలను పెంచుతుందన్నారు. ఇది పంట ఉత్పాదకతను పెంచి పంట సాగు ఖర్చు తగ్గించటం ద్వారా రైతుల ఆదాయాన్ని చుతుందన్నారు.500 మి.లీ. నానో యూరియా, నానో డి ఎ పి బాటిల్ = 45 కిలోల సాధారణ యూరియా బ్యాగ్కు సమానం.బాటిల్లో 20% నైట్రోజన్ ద్రవ రూపంలో ఉంటుంది.నానో యూరియా, నానో డిఎపి.ధర –266.50 రూపాయలకు అమ్మడం జరుగుతుందని తెలిపారు. ఖర్చు తగ్గుతుంది ఇతర శిలీంద్రనాశకాలు,పురుగుమందులతో కలిపి స్ప్రే చేయవచ్చు ఒకే స్ప్రేలో రెండు పనులు పూర్తవుతాయి. రైతుల డ్రోన్ సహాయంతో పిచికారి చేయడం వల్ల తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చును వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ లాల్చంద్, ఎఈఓ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## బెండాలపాడులో సిద్ధమైన ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జారే

- సమస్య రహిత గ్రామంగా బెండాలపాడు



**చంద్రుగొండ, ఆగస్ట్ 26(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం లో ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో బెండాలపాడు లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అధికారులను ఆదేశించారు. సమస్యలు లేని గ్రామం గా తీర్చి దిద్దాలని అన్నారు. మంగళవారం బెండాలపాడు ను సందర్శించి ఎమ్మెల్యే ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న పైలాన్ పనులను పరిశీలించారు. గ్రామంలో డ్రైనేజీ, విద్యుత్, త్రాగునీరు,పారిశుధ్య పనులు, తదితర మౌలిక వసతుల ఏర్పాటులో రాజి పడేది లేదని సమస్య రహిత గ్రామం గా తీర్చిదిద్దాలన్నారు. ఇప్పటికే పూర్తయిన ఇందిరమ్మ ఇండ్ల కు రంగులు వేసి లోగో పెట్టాలని తెలిపారు. అనంతరం అయ్యన్నపాలెంలో హెలిప్యాడ్, దామెరచర్ల లో సభ ఏర్పాటు పనులను పర్యవేక్షించారు. ఎంపీడీవో అశోక్, మిషన్ భగీరథ, విద్యుత్ శాఖ ఏఈ లు సాయి కృష్ణ, నరసింహారావు, మండల నాయకులు కార్యకర్తలు తదితరులు తదితరులు ఉన్నారు.

## ప్రముఖ కవి తోటమళ్లకు 'తెలుగు తేజం' పురస్కారం



**భద్రాచలం టౌన్,ఆగస్టు 26 ( ప్రజాజ్యోతి ):** భద్రాచలం పట్టణానికి చెందిన ప్రముఖ కవి, కవిరత్న తోటమళ్ల సురేష్ బాబుకు తెలుగు తేజం పురస్కారం లభించింది. తేగడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న సురేష్ బాబు సాహిత్యంలో చేస్తున్న విశేష కృషిని గుర్తించి ఈ అవార్డును ప్రకటించినట్లు ఈ మేరకు ఆహ్వానం పంపారు. ఆగస్టు 31న ఆంధ్రప్రదేశ్లో పల్నాడులో జరిగే సాహితీ సదస్సులో అవార్డు అందించనున్నట్లు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణంలు పేర్కొన్నారు. ఇప్పటికే పలు అవార్డులు అందుకున్న సురేష్ బాబును పలువురు అభినందించారు.

## పర్యావరణ హితానికే మట్టి విగ్రహాలు: తహసీల్ధార్

**భద్రాచలం ,ఆగష్ట 26,ప్రజాజ్యోతి :** ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మట్టితో తయారుచేసిన విగ్రహాలు పూజించాలని భద్రాచలం తహసీల్ధార్ దానియాల వెంకటేశ్వర్లు అన్నారు. గణపతి నవరాత్రులు సందర్భంగా స్థానిక అంబెడ్కర్ సెంటర్ లో తెలంగాణ వెలుగు ఛానల్ ఆధ్వర్యంలో ఉచిత మట్టి ప్రతిమల పంపిణి కార్యక్రమంలో అయన పాల్గొన్నారు ,అనంతరం భద్రాచలం తహసీల్ధార్ దానియాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కృత్రిమ ,రంగులు, రసాయనాలతో కూడిన విగ్రహాలు పూజించి నదులలో , చెరువులలో, కాలువలలో నిమజ్జనం చేయడం వలన జల వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని, తద్వారా జలాల్లో నివసించే జీవరాసులు మనుగడ కష్టమవుతుందని , పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని అన్నారుపర్యావరణానికి హాని చేయని విధంగా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని అన్నారు . ఈ కార్యక్రమంలో ఆర్ ఐ బుద్ధా నరసింహారావు పాల్గొన్నారు

### మట్టి గణపతిని పూజించండి - పర్యావరణాన్ని రక్షించండి :ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు

వినాయక చవితి సందర్భంగా మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భద్రాచల పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ నందు ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలను ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతరావు చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగినది.ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతిరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని అన్నారు. కృత్రిమ ,రంగులు, రసాయనాలతో కూడిన విగ్రహాలు పూజించి చెరువులలో, కాలువలలో నిమజ్జనం చేయడం వలన జల వనరులు కాలుష్యానికి గురవుతున్నాయని, తద్వారా జలాల్లో నివసించే జీవరాసులు మనుగడ కష్టమవుతుందని తెలిపారు. మదర్ తెరిసా ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి మాట్లాడుతూ విషరసాయనాలతో, కృత్రిమ రంగులతో చేయబడిన విగ్రహాలను కాకుండా మట్టి గణపతి లను పూజించడం వలన పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగస్వాములు అవ్వాలని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ 500 వందల మట్టి గణపతులను ఈరోజు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.మట్టితో చేసిన విగ్రహాలను పూజించి చెరువులు , కాలువలు ,గోదారి జలాలు కలుషితం కాకుండా కాపాడుకోవాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆయన తెలిపారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వలన నీటి కాలుష్యం భూమి కాలుష్యం వాయు కాలుష్యం అయ్యి భవిష్యత్తులో జీవరాశుల మనుగడ , మనుషుల మనుగడకు తీవ్ర ముప్పు వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ కొప్పుల మురళి నిర్వాహకులు బాబాజీ , సాయి కుమార్, వంశీ , నవీన్, ఉదయ్ , చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.





# ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

- ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, ఆగస్టు 26,ప్రజాజ్యోతి :** ఆదివాసీ గిరిజన గ్రామాల్లో పీహెచ్సీల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలతో పాటు అన్ని పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో మెడికల్ ఆఫీసర్లు, సబ్ యూనిట్ అధికారులతో వర్షాకాలంలో ప్రబలే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ మారుమూల ప్రాంత గిరిజన గ్రామాల్లో వైరల్ ఫీవర్స్ అధికంగా ఉన్నాయని, అందుకు మెడికల్ అధికారులు, వైద్య సిబ్బంది ప్రత్యేక బాధ్యత వహించి పీహెచ్సీకి వచ్చే రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి సరిపడా మందులు అందించాలన్నారు. కుక్క కాటు, పాముకాటు మందులు ముందస్తుగా అందుబాటులో ఉంచుకోవాలని, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధులు సోకిన వ్యక్తుల నుంచి రక్తనమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ అయితే తప్పనిసరిగా ఆ గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి అందరి నుంచి రక్తనమూనాలు సేకరించి పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో తప్పనిసరిగా ఫాగింగ్ చేయాలని, డెంగ్యూ, మలేరియా కేసులు ఉన్నట్లు తెలిస్తే మలేరియా అధికారి, డీఎంహెచ్వో, ఎంపీడీవోలకు తెలిపి పంచాయతీ సహకారంతో గ్రామంలో డ్రైనేజీలు, పాతకాలపు స్క్రాప్, చిల్లర దుకాణాల్లో నాసిరకం సరుకులు అమ్మకుండా చూడాలన్నారు. ఇంటి చుట్టుపక్కల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా సిబ్బందితో శానిటేషన్ చేయించి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామాల్లో డ్రైడే నిర్వహించాలని, గ్రామాల్లో గర్భిణులుంటే సమయానుకూలంగా చెకప్లు చేయించి సాధారణ ప్రసవానికి ఏరియా ఆసుపత్రికి కాకుండా పీహెచ్సీల్లో జరిగేలా చూసుకోవాలన్నారు. భద్రాచలం, మణుగూరు, చర్ల పీహెచ్సీల్లో గైనకాలజిస్టులు అందుబాటులో ఉన్నందున తప్పనరిసరిగా సాధారణ ప్రసవాలకే మొగ్గు చూపేలా చూడాలన్నారు. వర్షాకాలం సీజన్లో తీసుకోవాల్సిన పలు అంశాలపై చర్చించి అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏడీఎంహెచ్వో సైదులు, డిప్యూటీ డీఎంహెచ్వో చైతన్య, మలేరియా అధికారి స్పందన, ఎంసీడీ ప్రోగ్రామ్ అధికారి విజయ్కుమార్, ఇమ్యూనికేషన్ పీవో తేజశ్రీ, టీబీ అధికారి కులరెడ్డి, పీహెచ్సీల వైద్యులు పాల్గొన్నారు.

## వరి బాండ్ తో మెసపోవద్దు





**చర్ల, ఆగష్టు26 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో రైతులు గత కొన్ని సంవత్సరాలుగా సిన్జెంటా ఎస్సార్ 20,22 వరి బాండు విత్తనాలను సాగు చేస్తున్నారు. వరి బాండు 10 నుండి 12 క్వింటాళ్లు వరకు దిగుబడి వస్తుందని క్వింటా పది వేల నుండి పదివేల ఎనిమిది వందల రూపాయలు ధర చెల్లించి కొనుగోలు చేసేవారు కంపెనీ రైతులు. అక్కడక్కడ కొన్ని కొన్ని గ్రామాల్లో నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని కూడా అందజేసింది. దీంతో రైతులు బాగా నమ్మి వరి విస్తీర్ణాన్ని ఎక్కువ ఎకరాల్లో సాగు చేశారు.దీనికి తోడు పెట్టుబడి కూడా కంపెనీ అందిస్తుంది కాబట్టి రైతులు సాగు చేయడానికి ఇష్టపడేవారు. ఈ సీజన్లో మాత్రం 10 నుండి 12 క్వింటాళ్లు దిగుబడి రాలేదని ఎకరానికి మూడు క్వింటాళ్ల నుండి ఐదు క్వింటాళ్లుమాత్రమే దిగుబడి వచ్చిందని ప్రతి సంవత్సరం గ్రేడ్ లేకుండానే ధాన్యం కొనుగోలు చేసేవారని ఈసారి మాత్రం గ్రేడ్ పద్ధతిలో కొనుగోలు చేసి ఖాతాలలో 40వేల నుండి 45వేల రూపాయలు మాత్రమే ఖాతాలలో కంపెనీ జమ చేసిందని నష్టపోయిన రైతులకు కాంపొజిషన్ కింద ఇస్తానన్న నగదును ఇవ్వలేదని శివుడు సూపర్వైజర్ కొప్పుల శ్రీను వివరణ కోరగా నాకు ఏమి సంబంధం లేదు మీరు ఏమి చేసుకుంటారో చేసుకొండి అని రైతులతో దురుసుగా ప్రవర్తించాడని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను నట్టేట ముంచిందని ఎకరానికి 60 నుండి 75 వేల రూపాయల పెట్టుబడి అయిందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులను నట్టేట ముంచిన సింజంట కంపెనీ పై చర్యలు తీసుకొని మాకు నష్టపరిహారం అందజేయాలని అధికారులను రైతులు కోరుచున్నారు.ఈ కార్యక్రమం లో కొండా నరసింహారావు, ఎస్ సత్యవతి,తుర్రం ఆంజనేయ ప్రసాద్, బి రాంబాబు, బి ముత్యాలరావు, తుర్రం రాంబాబు, తుర్రం పెద్ద వీరాస్వామి, తుర్రం సత్తిబాబు ,పి మహేష్ ,ఎస్ సమత, కొమరం శీను, కొమరం ధర్మరాజు, కొమరం బాలరాజు, కొమరం సారయ్య, శ్యామల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## వినాయకచవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి :ఐటీడీఏ పీవో రాహుల్



**భద్రాచలం, ఆగస్టు 26,ప్రజాజ్యోతి :** కులమతాలకు అతీతంగా వినాయక చవితిని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఐటీడీఏ పీవో రాహుల్ మంగళవారం కోరారు. హిందూ సాంప్రదాయం ప్రకారం భక్తిశ్రద్ధలతో నియమనిష్టలతో ఇంటిల్లిపాది జరుపుకునే పండుగ వినాయక చవితి అని తొమ్మిదిరోజుల పాటు వివిధ అలంకరణలతో చాలా ఘనంగా సంతోషంగా పండుగ జరుపుకోవాలని, ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ఇంటి వైపు దృష్టి మరల్చకుండా పాఠశాలల్లో పండుగ జరుపుకునే విధంగా చూడాలని, అందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రజలను కోరుతూ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు.

### నిరుద్యోగ యువతకు మోటారువెహికల్ డ్రైవింగ్లో ఉచిత శిక్షణ...

భద్రాచలం ఐటీడీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో గిరిజన నిరుద్యోగ యువకులకు టీజీఎస్ఆర్టీసీజర్ఎస్ఈసీ వరంగల్లో హెవీ మోటారు వెహికల్ డ్రైవింగ్లో ఉచిత వసతితో పాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఐటీడీఏ పీవో రాహుల్ తెలిపారు. లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్సో పాటు బాడ్జీ నెంబర్ కలిగి ఉండాలని, ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువకులు తమ జిరాక్స్ సర్టిఫికెట్లు, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ బాడ్జీ నెంబర్ సర్టిఫికెట్లతో ఐటీడీఏ భద్రాచలం భవిత విభాగంలో సెప్టెంబరు 1వ తేదీవరకు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 6302608905, 9063889994లను సంప్రదించాలని కోరారు.

## భద్రాద్రి ఆలయ ఈవోగా దామోదరరావు



**భద్రాచలం కల్చరల్ , ఆగస్టు 26,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా దామోదరరావును ప్రభుత్వం నియమించింది. గతంలో ఇక్కడ పనిచేసిన ఆలయ ఈవో రమాదేవిని హౌసింగ్ కార్పొరేషన్ సెక్రటరీగా నియమించగా ఆమె స్థానంలో ఆయన ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. దామోదర రావు గతంలో భద్రాచలం ఆర్డీవోగా పనిచేయగా ఇటీవల కాలంలో ఎన్నో ఏళ్లుగా ఖాళీగా ఉన్న సబ్ కలెక్టర్ పోస్టును మృనాల్ శ్రేష్టకు కేటాయించడంతో దామోదరరావును ఆలయ ఈవో గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం కల్చరల్ , ఆగస్టు 26,ప్రజాజ్యోతి :** భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారికి అర్చకులు నిత్యకల్యాణం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాత సేవ, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణం తదితర నిత్య పూజలు నిర్వహించారు. గాలి గోపురానికి అభిముఖంగా ఉన్న ఆంజనేయస్వామి వారికి ఉదయం పంచామృతాభిషేకం చేసి తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి నిత్యకల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకువచ్చి శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం నిర్వహించారు. అనంతరం కల్యాణంలో పాల్గొన్న జంటలకు శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

## ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు వద్దు , మట్టి గణపతులే ముద్దు



**దమ్మపేట ,ఆగస్ట్ 26,ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేటలో పర్యావరణాన్ని కాపాడుదాం మట్టి గణపతుల విగ్రహాలను పూజిద్దామనే కార్యక్రమంలో భాగంగా ఈరోజు దమ్మపేటలో మేము సైతం ఫౌండేషన్ చైర్మన్ తంబల్ల రవి ఆధ్వర్యంలో మట్టి గణపతుల విగ్రహాలను పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది,వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకై ప్రతి ఒక్కరు తోడ్పడాలని,అది మనందరి బాధ్యత అని,ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వాడడం వలన పర్యావరణం కలుషితం అవుతుందని అ విగ్రహాలను చెరువుల్లో కలపడం వల్ల సమస్త జీవరాశులకు ప్రాణహాని ముంపు ఉందని., భక్తులందరూ గమనించి రానున్న రోజుల్లో మట్టి విగ్రహాలనే పూజించాలని తెలిపారు,మట్టి గణపతుల విగ్రహాల పంపిణీ కార్యక్రమంను విజయవంతం చేసిన మిత్రులందరికీ ధన్యవాదములు తెలిపారు.

## చవితి ఉత్సవాలకు సర్వం సిద్ధం





**భద్రాచలం ,ఆగస్ట్ 26,ప్రజాజ్యోతి :** సర్వవిఘ్నాలు తొలగించి మొదటి పూజ అందుకునే వినాయకుని చవితి పండగకు సర్వం సిద్ధమైంది. భద్రాచలం పట్టణంలోని అన్ని కాలనీలలో వినాయక చవితి మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి బుధవారం ఘనంగా వినా యక చవితి పండగను నిర్వహించేందుకు భక్తులు, కమిటీ సభ్యులు సిద్ధంగా ఉన్నారు. మంగళవారం సాయంత్రం ఉత్సవాల నిర్వాహకులు, ఆలయాల కమిటీ సభ్యులు, యువత వినాయకుని విగ్రహాలను బాణసంచా కాల్పులతో తీన్మార్ వాయిద్యాలతో వాహనాలపై సందడి సందడిగా ఊరేగింపు నడుమ ఆయా ప్రాంతాల్లో నిర్వహించే చవితి మహోత్సవాలకు తీసుకువచ్చారు. భద్రాచలం పట్టణంలోని అంబెడ్కర్ సెంటర్ ,జూనియర్ కాలేజీ గ్రౌండ్ ఏరియా ,మసీద్ సెంటర్ లలో వినాయక చవితికి అవసరమైన మట్టి విగ్రహాలు, పూలు, పండ్లు, పత్రి, పాలీలు, దుకాణాల వద్ద జనం సందడి నెలకొంది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోలుదారులతో ఆయా దుకాణాలు కళకళాడాయి. కలువ పువ్వు దగ్గర నుంచి వెల గకాయ, అన్ని రకాల పత్రిలు వరకు అన్నింటినీ వ్యాపారాలు ఆయా మార్కెట్లోకి తీసుకురావడంతో భద్రాచలం పట్టణ ప్రజలు మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు కొనుగోళ్లు చేసి శనివారం నాడు నిర్వహించుకునే చవితి పూజకు సిద్ధం చేసుకున్నారు.

## వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గణేశుని మట్టి విగ్రహాలు పంపిణీ



**అశ్వారావుపేట, ఆగస్టు 26, ప్రజాజ్యోతి:** నియోజకవర్గ కేంద్రంలో వాసవి క్లబ్ బాధ్యులు శీమకుర్తి సుబ్బారావు ఆధ్వర్యంలో గణేశుని మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగరాజు హాజరై భక్తులకు విగ్రహాలు అందించారు. ఆయన మాట్లా డుతూ పర్యావరణ హితం కోసం మట్టి విగ్రహాలను పూజించడం అలవాటు చేసుకోవాలని, తద్వారా సమాజానికి మంచి చేసిన వారమవుతామన్నారు. మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న లైన్స్ క్లబ్ బాధ్యులను అభినందించారు ఈ కార్యక్రమంలో పలువురు వాసవి క్లబ్ బాధ్యులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాల పంపిణీ



**ఇల్లందు, ఆగస్ట్ 26, ప్రజాజ్యోతి:** సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా సింగరేణి జియం కార్యాలయంలో మంగళవారం మట్టి విగ్రహాలను ఎస్ఓటూ జియం రామస్వామి ఉద్యోగులకు వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరికి సకల శుభాలనిచ్చే విజయ విఘ్నేశ్వరుడికి మన పురాణాలు శాస్త్రాల ప్రకారం మట్టి విగ్రహాలనే వినాయక నవరాత్రి ఉత్సవాలలో పూజించాలని, అలాగే పర్యావరణ సమతుల్యాన్ని కాపాడాలన్నారు. మట్టి వినాయక విగ్రహాల పుజలతోనే పుణ్య ఫలం లభిస్తుందని పండితులు పేర్కొంటున్నారని తెలిపారు. ప్రతి కుటుంబం మట్టి వినాయక విగ్రహాలతో పూజ చేయాలని సూచించారు. మట్టి వినాయక విగ్రహాలను ప్రత్యేకంగా తెప్పించి కార్మిక వాడలు, పట్టణంలోని వివిధ స్థలాలలో పంపిణి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎజియం (ఐఇ) గిరిధర్ రావు, ఏరియా ఇంజనీర్ నరసింహరాజు, ఏరియా సేఫ్టీ జాకీర్ హుస్సేన్, డీజిఎం (పర్సనల్) అజ్మీర తుకారాం, డీజియం (సివిల్) రవి కుమార్, అధికారులు రామమూర్తి, యస్. దిలీప్ కుమార్, రామదాస్, శ్యాం ప్రసాద్, అజయ్, ఎన్. సతీష్ కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## దోషులను కఠినంగా శిక్షించాలి

- **చట్టాలు అమలు చేయడంలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి... జి. గంగ ప్రగతి శీలా మహిళా సంఘం మండల అధ్యక్షురాలు, కల్పన జిల్లా కార్యదర్శి**

**అశ్వారావుపేట, ఆగస్టు 26, ప్రజాజ్యోతి:** లక్ష్మీ ప్రసన్న మృతికి కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలని ప్రగతిశీల మహిళా సంఘం మండల అధ్యక్షురాలు గంగ, జిల్లా కార్యదర్శి కల్పన డిమాండ్ చేశారు. బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆమె మాట్లాడుతూ మహిళలను వేధించడం చంపటం దుర్మార్గులకు అలవాటుగా మారిందని చింతూరు మండలానికి చెందిన ఆదివాసీ బాలికపై మత్తుమందు ఇచ్చి అత్యాచారం చేయటం, మేడిపల్లిలో గర్భిణీ కిరాతకంగా హత్య చేయటం, మహబూబ్ నగర్ లో భార్యను హత్య చేయడం ఒంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. మహిళలను కిరాతకంగా చంపుతున్న దోషలను శిక్షించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని వారికున్న చట్టాలు కాగితాలికే పరిమితమవుతున్నాయన్నారు. ఇప్పటికైనా మహిళలను దారుణంగా చంపిన దోషులను కఠినంగా శిక్షించాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుర్గా, సరోజిని, లక్ష్మీ ,పద్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# నిందితుల అరెస్టు

- **లక్ష్మీ ప్రసన్న అనుమానస్పద మృతి కేసులో ముగ్గురిని రిమాండ్ తరలించిన పోలీసులు**
- **పరారీలో మరో నిందితుడు**
- **ప్రత్యేక టీం ఏర్పాటు చేసి గాలిస్తున్నామని తెలిపిన సీఐ నాగరాజు**

**అశ్వారావుపేట, ఆగస్టు 26, ప్రజాజ్యోతి:** రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లక్ష్మీ ప్రసన్న మృతి కేసులో పోలీసులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో సీఐ నాగరాజు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రానికి చెందిన లక్ష్మీ ప్రసన్న ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని, మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. అందులో భాగంగా బుధవారం





మృతురాలి భర్త నరేష్ ,అతని అక్క భూలక్షి ,తల్లి విజయలక్షి లను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు తరలించామన్నారు. మరో నిందితుడు శ్రీనివాసరావు పరారీలో ఉన్నారని, అతని కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పరారీలో ఉన్న నిందితుడిని అదుపులోకి తీసుకొని దర్యాప్తును వేగవంతం చేస్తామన్నారు. ఎస్ఐలు యాయాతి రాజు, రామ్మూర్తి, అఖిల, పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్తాబవుతున్న మండపాలు

- **నేటి నుంచి కొలువు తీరని ఉన్న గణనాథులు**



**అశ్వారావుపేట, ఆగస్టు 26, ప్రజాజ్యోతి:** గణనాథుని నవరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గ వ్యాప్తంగా మండపాలు ముస్తాబవుతున్నాయి నేటి నుంచి 9 రోజులపాటు గణేశుడు భక్తులచే ప్రత్యేక పూజలు అందుకొనున్నారు. మున్సిపాలిటీ పరిధిలో చవితి సందడి మొదలైంది. వాడవాడలా, వీధివీధిన విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు యువకులు పోటీపడుతున్నారు. చవితి రోజు పూజా సామగ్రి కొనుగోలుకు మహిళలు తరలి వస్తున్నారు. పట్టణంలోని వీధుల్లో వినాయక మండపాల ఏర్పాట్లలో యువత,మహిళలు నిమగ్నమయ్యారు.తొలిపూజతో గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. తొమ్మిది రోజుల పాటు కన్నులపండువగా నిర్వహించేందుకు గణేష్ భక్త ఉత్సవ కమిటీల ప్రతినిధులు సిద్ధమయ్యారు.

## మట్టి గణపతిని పూజిద్దాం.. పర్యావరణాన్ని రక్షిద్దాం

- **భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పిద్దాం.. సీఐ పింగళి నాగరాజు**

**అశ్వారావుపేట, ఆగస్టు 26, ప్రజాజ్యోతి:** పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతిని పూజి ద్దామని భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అశ్వారావుపేట సిఐ పింగళి నాగరాజు అన్నారు. మంగళవారం ఏబీఎన్ఆంధ్రజ్యోతి, మండల ఆర్యవైశ్యసంఘం,ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రమైన అశ్వారావుపేటతో పాటు తిరుమలకుంట, వినాయకపురం గ్రామాలలో భక్తులకు మట్టితో చేసిన గణపతి విగ్రహాలను సిఐ నాగరాజు చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ రసాయనిక రంగులు వాడిన ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిషేధించి మట్టి విగ్రహాలను వాడటం వల్ల పర్యావరణ సమతులిత దెబ్బతినకుండా ఉంటుందన్నారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా మన తర్వాత తరం వారికి మంచిచేసిన వారమవుతామన్నారు. మట్టి విగ్రహాలను పంపిణీ చేసిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, మండల,పట్టణ ఆర్యవైశ్య సంఘం సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు, సీనియర్ పాత్రికేయుడు శీమకుర్తి శ్రీనివాసరావు,తిరుమలశెట్టి అప్పారావు ,కృష్ణారెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, రామ లక్ష్మయ్య, రవికిరణ్, శీమకుర్తి జితేంద్ర,గుప్తా, పాల్గొన్నారు.



## పేదలను ఆదుకోవడంలో భాగంగానే రేషన్ కార్డ్ పంపిణీ: ఎమ్మెల్యే పాయం



**గుండాల ప్రజా జ్యోతి. 26.** పేదల ను ఆదుకోవడంలో భాగంగానే రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతుందని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు గుండాల మండలంలో పాలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం శంకుస్థాపనల అనంతరం రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు మండలంలోని ఎనిమిది వందల నలభై





ఏడు మంది నిరుపేదల గుర్తించి తెల్ల రేషన్ కార్డులను అందియడం జరుగుతుందని మిగిలిన అందని నిరుపేదలకు మలి విడతలో రేషన్ కార్డులను అందిస్తామన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల ప్రభుత్వమని ప్రభుత్వం ఇచ్చిన ప్రతి నామిని అమలుపరుస్తుందని ఆయన అన్నారు సన్న బియ్యం పథకాన్ని ప్రతి పేదలకు అందియడం కోసమే రేషన్ కార్డులను ఇస్తున్నామని గత 15 20 సంవత్సరాలుగా రేషన్ కార్డు లేక నిరుపేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రేషన్ కార్డును ఇస్తూ సన్నబియ్యం అందించడంల లనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులను మంజూరు చేస్తుందని ఆయన అన్నారు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయిన ప్రతి లబ్ధిదారులు త్వరితగా ఇల్లు నిర్మించుకోవాలని విడుదలవారీగా బిల్లులు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమానికి ముందుగా గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం పంచాయతీ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు మండలానికి దూరంగా ఉన్న దామరతోగు గ్రామపంచాయతీ ప్రజల కు ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు గ్రామపంచాయతీలో జరుగుతున్న జరగాల్సిన పనులను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి దిశా నిర్దేశం చేశారు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు అధికారుల తో పరిష్కారంగా సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించడానికి తన కృషి చేస్తానన్నారు తామరతోగు గ్రామంలో 20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు ఎస్టీ, ఎస్సీ కాలనీలో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించిన అనంతరం నాగారం గ్రామంలో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించిన అనంతరం పి ఆర్ రోడ్డు నుండి నాగారం కోటి యాభై లక్షల రూపాయలతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు లింగగూడెం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు మోదుగుల గూడెం నుండి సజ్జలబోడు రెండు కోట్ల 40 లక్షల రూపాయలతో మంజూరైన బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ రషీద్ మండల అభివృద్ధి అధికారి బాల రాజు పి ఆర్ డి ఈ రామనాథం ఎం పి ఓ రెడ్డి వివిధ శాఖల ఏఈలు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖదీర్ ముత్తయ్య దారా అశోక్ ఓకే బుచ్చయ్య కిరణ్ డాక్టర్ బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.